ప్రజాశక్తి
మంగళవారం 2 జనవరి 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

అణచాలని చూస్తే..

ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి
- కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



శిబిరంలో మాట్లాడుతున్న రమాదేవి

ప్రజాశక్తి-అద్దంకి

పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చకుండా మాట తప్పి మడమ తిప్పుతూ అంగన్‌వాడీ ఉద్యమాన్ని అణచాలని చూస్తే ఈ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించి.. సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె నాలుగేళ్ల క్రితం అంగన్వాడీ కుటుంబాల ఆర్థిక పరిస్థితులు.. నేడున్న ఆర్థిక పరిస్థితులు గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అధిక ధరలు, అధిక పన్నులు, అధిక కరెంటు ఛార్జీలు, పెరిగిన ఇంటి అద్దెలు, పెరిగిన ▶ 2లో



కిసాన్ క్రెడిట్ కార్డు అందజేస్తున్న కేంద్ర మంత్రి పర్షోత్తం రూపాల

తమిళనాడు జాలర్ల సమస్య పరిష్కారానికి చర్యలు

8లో

వైఎస్ఆర్ కాంగ్రెస్

ఒంగోలు ఎంపీ అభ్యర్థి ఎవరో.?

- వైవి పోటీపై స్పష్టత లేక కొనసాగుతున్న ఉత్కంఠ
- అసెంబ్లీ అభ్యర్థుల తుది నిర్ణయంలో అదే కీలకం
- గిద్దలూరులో పోటీ చేయాలని బాలినేనికి సిఎం జగన్ నిర్దేశం
- ఒంగోలులో శిద్దా ఒప్పుకోకుంటే ఎవరిని దించాలనే దానిపై తర్జనభర్జన



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలు పార్లమెంటులో అభ్యర్థిగా ఎవరుంటారు? అధిష్టానం ఆలోచన ఏమిటి? మాజీ ఎంపీ వైవి.సుబ్బారెడ్డి తిరిగి పోటీ చేస్తారా? లేక సిట్టింగ్ ఎంపీ మాగుంటనే కొనసాగిస్తారా? అందుకు సిఎం నిర్ణయం ఎలా ఉండబోతుంది? అనే దానిపైనే ఇప్పుడు చర్చ సాగుతోంది. పార్లమెంటులో ఎవరు పోటీలో ఉంటారనే దాన్ని బట్టే అసెంబ్లీ అభ్యర్థులపై తుది నిర్ణయానికి రావాలనే ఆలోచనలో సీనియర్ నేత మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఉన్నారు. దీనిపైనే తర్జనభర్జన సాగుతోంది. జిల్లాలో తొలివిడత ప్రకటించాక మళ్లీ మిగతా స్థానాలపై స్పష్టత రాలేదు. అధిష్టానం దీనిపై కసరత్తు సాగించినా ప్రకటించడంలో జాప్యం జరుగుతోంది. ఇంకా కొలిక్కి రాలేదు. కోఆర్డినేటర్‌తో సుదీర్ఘమంతనాలు జరిపిన మాజీ మంత్రి బాలినేని కూడా సిఎం జగన్‌తో భేటీ అయ్యాక హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఆ తర్వాత జాబితాపై స్పష్టత లేదు. అయితే గిద్దలూరు నుంచి బాలినేనిని పోటీ చేయాలని సిఎం జగన్ నిర్దేశించారు. అక్కడ పోటీ చేస్తే మిగతా స్థానాల్లోనూ ప్రచారానికి ఉపయోగంగా ఉంటుందని సిఎం జగన్ అభిప్రాయపడ్డట్లు తెలుస్తోంది. దీనిపై బాలినేని తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. బాలినేని ఒంగోలు నుంచి అభ్యర్థిగా మాజీ మంత్రి శిద్దాను పిలిచి పోటీ చేయాలని అధిష్టానం చెప్పిన సంగతి తెలిసిందే.. ఆయన్ను విజయవాడకు పిలిచి మాట్లాడారు. శిద్దా మాత్రం దర్శి తప్ప ఎక్కడా పోటీ చేయబోమంటూ తెగేసి చెబుతున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు తనను కలిసేందుకు వచ్చిన పలువురు నేతలతోనూ ఆయన ఇదే విషయం చెప్పారు. ఒంగోలులో పోటీకి ససేమిరా అంటున్నారు. శిద్దా రాఘవరావు ఒప్పుకోకుంటే ఇంకెవరిని పోటీలోకి దించాలనే దానిపైనా తర్జనభర్జన సాగుతోంది. అధిష్టానం గట్టిగా ఒప్పించి పోటీకి దించితే తప్ప ఇక్కడ ఏమిటనేదీ స్పష్టత లేదు. శిద్దా కాకుంటే కాపు సామాజికవర్గం నుంచి ఎవరికైనా ప్రాధాన్యత ఇస్తారా? అనే దాని పైనా ఆలోచన చేస్తున్నారు. ఎవరూ ప్రత్యామ్నాయంగా లేకుంటే బాలినేనే ఇక్కడ ఉండే అవకాశాలు కూడా లేకపోలేదు. అయితే ఎంపీ అభ్యర్థిపై స్పష్టత వచ్చాకే పోటీ ఎక్కడ నుంచి చేయాలనే దానిపై ▶ 2లో

నూతన వేడుకల్లో విషాదం

- బొలేరోను ఢీ కొట్టిన బైక్..
- ముగ్గురు స్నేహితులు దుర్మరణం
- పెట్రోల్ ట్యాంకు పగిలి.. వీరిలో ఒకరు సజీవదహనం



ప్రమాదం జరిగిన స్థలం


ప్రజాశక్తి-బేస్తవారిపేట

నూతన సంవత్సర వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. రోడ్డుప్రమాదం మూడు కుటుంబాలలో విషాదం నింపింది. బొలెరో వాహనాన్ని అతివేగంగా బైక్ ఢీకొట్టడంతో బైక్ పెట్రోల్ ట్యాంక్ పగిలి.. పెట్రోల్ పడి.. ఒకరు సజీవదహనమయ్యారు. మరో ఇద్దరు యువకులు తలలు పగిలి మృత్యువాతపడ్డారు. నూతన సంవత్సర వేడుకలకు వెళ్తున్న ముగ్గురు స్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో బేస్తవారిపేట, పాపాయిపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదం బేస్తవారిపేట మండలం, చెట్టిచెర్ల రోడ్డు హైవేపై ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో జరిగింది.

బేస్తవారిపేట పట్టణంలోని పాపాయిపల్లి గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన గుజ్జుల శ్రీను (21), పిక్కిలి రాహుల్ (21), నల్లబోతుల పవన్(20) ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో నూతన సంవత్సర వేడుకలలో భాగంగా మోటార్ సైకిల్‌పై గిద్దలూరు వైపు వెళ్తున్నారు. వేగంగా వెళ్తున్న వారి మోటార్ సైకిల్ చెట్టిచెర్ల రోడ్డు హైవేపై ఎదురుగా వస్తున్న బొలెరోను బలంగా ఢీకొట్టింది. దీంతో మోటార్‌సైకిల్ పెట్రోల్ ట్యాంక్ పగిలి పెట్రోల్ అటు బొలెరో మీద, ఇటు యువకుల మీద పడింది. ఈ ప్రమాదంలో పెట్రోల్ కారణంగా మంటలు అంటుకోవడంతో ద్విచక్రవాహనం నడుపుతున్న పవన్ అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. పెట్రోల్ బొలెరో వాహనం మీద పడటంతో దానికి కూడా మంటలు అంటుకొని పూర్తిగా కాలిపోయింది. మోటార్‌సైకిల్‌పై వెనక ఉన్న ఇద్దరు యువకులు శ్రీను, రాహుల్ కూడా రోడ్డు మీద పడటంతో తలలు పగిలి చనిపోయారు. మృతదేహాలను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పాపాయిపల్లిలో విషాదఛాయలు

శ్రీను, రాహుల్, పవన్ స్నేహితులు. ఈ ముగ్గురూ అవివాహితులే.. గ్రామానికి గుజ్జుల వెంకటరత్నం-ఆనందలక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు గుజ్జుల శ్రీను. ఈ యువకుడు శ్రీశైలం ప్రాంతంలో ఆయుర్వేద మందులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు. నూతన సంవత్సర వేళ ఇంటికి వచ్చాడు. రాహుల్ అదే గ్రామానికి చెందిన పిక్కిలి మహేష్ రాజేశ్వరి దంపతుల ఏకైక కుమారుడు. ఒక ప్రైవేట్ కాలేజీలో పారా మెడికల్ చదువుతున్నాడు. పవన్ నల్లబోతుల పిచ్చయ్య లక్ష్మీదేవిల ముగ్గురు కుమారుల్లో చివరివాడు. ఖమ్మంలో ఒక ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతూ డ్రైవర్‌గా అప్పుడప్పుడూ పనికి పోతుంటాడు. ఈ ముగ్గురు స్నేహితులు నూతన సంబరాల్లో భాగంగా మోటార్ సైకిల్‌పై గిద్దలూరు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోవడంతో పాపాయిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. కంభం సిఐ రాజేష్, బేస్తవారిపేట ఎస్ఐ బి.నరసింహారావు ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక వాహనాన్ని తెప్పించారు. అప్పటికే యువకులు ప్రాణాలు కోల్పోయారు. బేస్తవారిపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఒంగోలులో నూతన సంవత్సర వేడుకల్లో కలెక్టర్ దినేష్‌కుమార్ కుటుంబం

అట్టహాసంగా నూతన సంవత్సర వేడుకలు

8లో

సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి సురేష్‌కి మున్సిపల్ కార్మికుల వినతి
- యూనియన్ నేతలతో చర్చిస్తామని మంత్రి హామీ



ర్యాలీగా వెళుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను కోరారు. మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె ఏడోరోజులో భాగంగా కార్మికులు సోమవారం ఒంగోలులోని మంత్రి క్యాంప్ ఆఫీసు వరకు ప్రదర్శన నిర్వహించారు. మంత్రిని కలిసి సమ్మె డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికులు ఏడో రోజులుగా వేతనాలు కోల్పోయి సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం వారితో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను ▶ 2లో

మంత్రి సురేష్‌కు అసమ్మతి సెగ

ప్రజాశక్తి-శింగరాయకొండ / ఒంగోలు

రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి, వైసిపి కొండపి ఇన్‌ఛార్జి ఆదిమూలపు సురేష్‌కు కొత్త సంవత్సరం సందర్భంగా కొండపిలో అసమ్మతి సెగ తగిలింది. శింగరాయకొండలో ఉన్న వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రూపుల రచ్చ సోమవారం ఒంగోలులో బయటపడింది. మంత్రి ఆదిమూలపు సురేష్ క్యాంప్ కార్యాలయం వద్ద మాజీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు గ్రూపు అసంతృప్తి బయటపడింది. నూతన సంవత్సరం సందర్భంగా మంత్రి సురేష్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు వైస్ ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షులు సామంతుల రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వరికూటి అశోక్‌బాబు గ్రూపు నేతలు ఒంగోలులోని మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. వీళ్లంతా శుభాకాంక్షలు చెప్పేందుకు సిద్ధమవుతున్న సమయంలో అప్పటికప్పుడే వచ్చిన వీరికి వ్యతిరేకంగా ఉన్న రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి గ్రూపు నేరుగా మంత్రి సురేష్‌కు శుభాకాంక్షలు చెప్పి ఫొటోలు దిగటం కనిపించింది. దానిని తట్టుకోలేని వరికూటి అశోక్‌బాబు గ్రూపుగా ఉన్న ఈ టీమంతా ఉదయం నుంచి మేమందరం వస్తే పట్టించుకోకుండా అప్పటికప్పుడు వచ్చిన వారిని పట్టించుకుంటారా.? అంటూ అసంతృప్తి చేశారు. వాళ్ల శుభాకాంక్షలు చెప్పే టైములో మంత్రి అక్కడ నుంచి ఫోన్‌లో మాట్లాడుకుంటూ.. వెళ్లిపోవడం తట్టుకోలేని వారంతా వెనుదిరిగారు. మంత్రి సెక్యూరిటీ సిబ్బంది మాట్లాడుతూ సార్‌కు ఫోన్ వచ్చి పక్కకు వెళ్లారని.. మంత్రిని కలవాలని బతిమిలాడినా కూడా సామంతుల రవికుమార్‌రెడ్డి, యనమల మాధవి, షేక్ పటేల్, షేక్ సలీంబాషా, భాగ్యమ్మ, షేక్ అబ్దుల్లా, ముల్లపూడి సత్యనారాయణ, షేక్ కరీంతో పాటు మరికొంతమంది అక్కడ నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న మంత్రి సురేష్ రవికుమార్‌రెడ్డికి సన్నిహితంగా ఉన్న పోలీసులను రంగంలోకి దించి.. వారితో చర్చలు జరిపారు. జరిగిన విషయం తెలుసుకున్న మంత్రి ఈ నెల ఎనిమిదో తేదీన కొండపిలో సామాజిక బస్సుయాత్ర ఉందని, ఆ తరువాత అన్ని సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. నూతన సంవత్సరం సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న గ్రూపుల రచ్చ బయటపడింది. వైద్యవిభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మండల పార్టీ అధ్యక్షుడు సామంతల రవికుమార్‌రెడ్డి మధ్య ఉన్న వివాదం నూతన సంవత్సర వేడుకల వేళ మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద బయటపడింది. ఇది ఎలాంటి పరిస్థితికి దారితీస్తుందోనని వైసిపి నాయకులు చర్చించుకుంటున్నారు.



ఆందోళన చేస్తున్న వరికూటి గ్రూపు

పోస్టు కార్డులతో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సమగ్ర శిక్ష ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ జెఎసి ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టిన సమ్మె 13వ రోజుకి చేరుకుంది. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సోమవారం నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రికి సమగ్ర శిక్ష ఉద్యోగులు పోస్ట్ కార్డు ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరిని రెగ్యులర్ చేస్తానన్న మాటను నిలబెట్టుకోమని , సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయమని పోస్ట్ కార్డు ద్వారా ముఖ్యమంత్రికి విన్నవించారు. అనంతరం ర్యాలీగా పోస్టాఫీస్ వరకు వెళ్లి పోస్ట్ బాక్స్‌లో కార్డ్స్ వేశారు. తరువాత రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి ఆదిమూలపు సురేష్‌కి అందజేవారు. తమకు వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని, గత 13 రోజులుగా నిరవధిక సమ్మెలో ఉన్నామన్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులందరిని రెగ్యులర్ చేసే విధంగా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. మంత్రి స్పందిస్తూ మంగళవారం జరిగే సమావేశంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డిని కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఎంపి మాగుంట శ్రీనివాసులు స్పందిస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను పరిశీలిస్తానని తెలియజేశారు. . జేఏసీ నాయకులు మహేష్, బాషా, జ్యోతి, సింగయ్య, కిరణ్ పాల్గొన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మస్తాన్, కార్యదర్శి శేషయ్య మాట్లాడుతూ సమగ్ర శిక్షలోని ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంతనూతలపాడు యుటిఎఫ్ మండల కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడారు. సిఐటియు మద్దిపాడు మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రకాశం జిల్లా అద్యక్షులు ఎం హరిబాబు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి, కెజిబివి నాయకులు రత్నమాలిని దేవి, డేటా ఎంట్రీ ఆపరేటర్ జిల్లా నాయకులు శ్రీదేవి, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఒంగోలు ఎంపీ అభ్యర్థి ఎవరో.?

(మొదటిపేజీ తరువాయి)

తుది నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనలో బాలినేని ఉన్నారు. మాగుంటకే ఒంగోలు పార్లమెంటు సీటు ఇవ్వాలని బాలినేని తొలి నుంచీ గట్టిగానే పట్టు పడుతున్నారు. దీనిపై అధిష్టానం ఆలోచన వేరేగా ఉందనే ప్రచారం ఉంది. వైవి.సుబ్బారెడ్డి ప్రయత్నాలు ఏమిటనేదీ ఆయనకు స్పష్టత లేదు. మాగుంటను ప్రస్తుతం సాగుతున్న ప్రచారం ప్రకారం వైవి కుటుంబం నుంచి పార్లమెంటుకు పోటీలో దింపే నిర్ణయమే జరిగితే.. బాలినేని ఒంగోలులో కన్నా గిద్దలూరులోనే పోటీ చేస్తేనే బెటర్ అనే ఆలోచనలో ఉన్నారు. అందుకే బాలినేని కూడా దీనిపై స్పష్టత వచ్చాకే మిగతా స్థానాలతో పాటు తాను ఎక్కడ పోటీ చేయాలనే దానిపై తుది నిర్ణయానికి వచ్చే అవకాశం కనిపించడం లేదు. అసెంబ్లీ స్థానాల్లోనూ ఇంకా మార్పులు ఏమైనా ఉంటాయా? అనేదీ స్పష్టత లేదు. ఏదేమైనా అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికలో కొంత కాలం జాప్యం తప్పదనిపిస్తోంది. ఈ కారణాల రీత్యా నేతలు అందరూ గందరగోళంలో ఉన్నారు. బాలినేని జిల్లాకు దూరంగా ఉన్నారు. ఏటా ఒంగోలులో ఉండే ఆయన ఈ సారి కారణాలేమైనా జిల్లాకు రాలేదు. 25 వేల పట్టాలకు నిధులు రాలేదన్నదీ ఓ కారణంగా చెబుతున్నా టిక్కెట్ల వ్యవహారంలో కసరత్తు కొలిక్కి రాకపోవడం కూడా ఓ అంశంగానే కనిపిస్తోంది. జాబితాపై నేతల్లో ఎదురుచూపులు తప్పడం లేదు. మార్పులపైనా దృష్టి సారించారు. నాన్చుడు వల్ల ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. టిక్కెట్లు రావని తేలిన సిట్టింగులు వేరుకుంపట్లు పెడుతున్నారు. తెరచాటున వ్యవహారాలకు సన్నాహాల్లో ఉన్నారు. ఇక మంత్రి ఆదిమూలపు సురేష్ క్యాంపు కార్యాలయం వద్ద పార్టీలో గ్రూపుల అసంతృప్తులు తప్పలేదు.

ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు..

(మొదటిపేజీ తరువాయి)

నీటి ఛార్జీలు తదితర విషయాల్లో అదనంగా వచ్చిన మార్పుల గురించి అంగన్వాడీలు వివరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో ఇచ్చే దానికి, భారాల రూపంలో ప్రజల నుంచి తిరిగి లాక్కునే దానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. తద్వారా ప్రభుత్వం ప్రజల నుండి లాభపడు తుందే తప్ప నష్టపోవటం లేదన్నారు. తల్లి తర్వాత తల్లి లాంటి పాత్ర పోషించే అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరిం చడానికి డబ్బులు లేవని సాకులు చెప్తున్నారని, డబ్బులు లేనప్పుడు స్మార్ట్ మీటర్ల కోసం రూ.20 వేల కోట్లు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ.450 కోట్లతో విశాఖలో ముఖ్యమంత్రికి ఇల్లు ఎలా నిర్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ ఉద్య మానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల మద్దతును కూడగట్టటంతో పాటు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న ప్రజల మద్దతును కూడగడతామని, తద్వారా ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చేసుకొని అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని, తద్వారా సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 3న కలెక్టరేట్ల వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, అంగన్వాడీ నాయకులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌కు విరాళం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి ఆదేశాల మేరకు ఆడంబ రాలకు దూరంగా స్థానిక అమరావతి గ్రౌండ్లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, ప్రజలు పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ నిర్వహణకు విరాళాలు అందజేశారు. రూ.2,31,523 నగదును విరాళాల రూపంలో ఇచ్చారు. అన్న క్యాంటీన్ నిర్వహణకు విరాళాలు అందించిన వారికి డాక్టర్ ఉగ్ర ధన్యవాదాలు తెలియజేశారు.



విరాళం అందజేస్తున్న దృశ్యం

సమస్యలు పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

పర్మినెంట్ చేయాలని, లేని పక్షంలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్ స్పందిస్తూ కార్మికులు సమ్మెను విరమించాలని కోరారు. ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే హెవీ వెహికిల్ డ్రైవర్లకు, శానిటేషన్ వెహికిల్ డ్రైవర్లకు, అండర్ గ్రౌండ్ కార్మికులకు, మలేరియా కార్మికులకు ఆరు వేల రూపాయలు హెల్త్ అలవెన్స్ అమలు చేస్తూ సోమవారమే జీవో జారీ చేయడం జరిగిందన్నారు. మంగళవారం మంత్రివర్గ కమిటీ విజయవాడలో మున్సిపల్ యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించి కార్మిక సంఘం ప్రతిపాదించిన 13 డిమాండ్ల మీద చర్చలు జరుపుతామని చెప్పారు. తమ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు సంబంధించిన ప్రభుత్వమని, కార్మికుల డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లామని, కార్మికుల డిమాండ్ల పట్ల ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించేది లేదని కార్మిక సంఘ నాయకులు మంత్రికి స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, యూనియన్ నగర కార్యదర్శి రత్నకుమారి, నాయకులు టి విజయ, ఎం శ్రీలక్ష్మి, కె ఉమా, కాకుమాను వెంకటేశ్వర్లు, ఆర్ రాములు, గడ్డం నరసింహ, రంపతోటి శ్రీనివాసరావు, పి దివ్య, కె మోహన్‌రావు పాల్గొన్నారు. కోవిడ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని, చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకోవాలని మంత్రి అక్కడే ఉన్న నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావును ఆదేశించారు.

బాలినేనికి రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కనిగిరి

మాజీ మంత్రి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డిని హైదరాబాదు లోని ఆయన నివాసంలో సోమ వారం రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్య నారాయణరెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సంతోషంగా ఉండాలని ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు.



బాలినేనితో సత్యనారాయణరెడ్డి

టిడిపి ఆఫర్ ఇస్తోంది కదా..?

పార్టీ మారాలని జంకెకు అనుచరుల సూచన

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం నియోజకవర్గ రాజకీయం ఆసక్తికరంగా మారనుందని చర్చ సాగుతోంది. మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి వైసిపి జిల్లా అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి నుంచి టికెట్ ఆశిస్తున్న వారిలో జంకె ఉన్నారు. తనకే సీటు లభిస్తుందని ఆయన ధీమాగా ఉన్నట్లు తెలిసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి వర్గం మాత్రం ఈ పాటికే తమకు సీటు ఖరారు అయ్యిందని చెబుతోంది.

మార్కాపురంలో స్థానిక ఎమ్మెల్యే స్థాయి నాయకులు మధ్య పోటీ అధికం కావడంతో వైసిపి అధిష్టానానికి అభ్యర్థి ఎంపిక తలనొప్పిగా మారింది. స్థానికులను పక్కన పెట్టి స్థానికేతరుడు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పేరు పరిశీలనలోకి వచ్చింది. అయితే శిద్దా మార్కాపురం సీటుపై సుముఖంగా లేనట్లు తెలిసింది. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి అభ్యర్థిత్వం దాదాపు ఖరారైనట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఈ వారంలో నాగార్జునరెడ్డి పేరు ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. జంకె వెంకటరెడ్డి వర్గం మాత్రం అదేమీ లేదని కొట్టి పారేస్తోంది. వైసిపి అభ్యర్థిగా జంకె బరిలో ఉంటారని ఆయన అనుచరగణం చెబుతోంది. ఇదే క్రమంలో టిడిపి కూడా ఆచి తూచి అడుగు వేస్తున్నట్లు తెలిసింది. జంకె వెంకటరెడ్డికి సీటును వైసిపి నిరాకరిస్తే టిడిపి తమవైపు లాక్కోవాలనే ప్రయత్నాలు చేస్తోందని తెలిసింది. జంకె వెంకటరెడ్డి గతంలో తెలుగుదేశం పార్టీలో కొనసాగిన వ్యక్తి కావడంతో ఆ పార్టీ క్యాడర్‌తో నేటికీ సంబంధాలు ఉన్నాయి. జంకె వెంకటరెడ్డిపై మంచి అనే ముద్ర ఉంది.



వైసిపి జిల్లా అధ్యక్షుడుగా కొనసాగుతున్న జంకె వెంకటరెడ్డికి ఆ పార్టీ అధిష్టానం సరైన న్యాయం చేయడం లేదనేది జంకె అనుచరుల వాదన. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు అమ్ముడుపోతున్నా... జంకె వెంకటరెడ్డి మాత్రం జగన్ వెంటే ఉన్నారని... నమ్మినందుకు ఆయనకు సిఎం జగన్ కూడా పెద్దగా పట్టించుకున్నదేమీ లేదంటున్నారు. గత ఎన్నికల్లో సీటును త్యాగం చేస్తే... ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామని సిఎం జగన్ స్వయంగా చెప్పినా అది జరగలేదు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీటు లభిస్తుందో లేదో తెలియదు. నాన్చుడు ధోరణి కొనసాగుతోంది. చివరలో హ్యాండిస్తే తమ పరిస్థితి ఏమిటని జంకె అనుచరులు అంటున్నారు. ఇదే క్రమంలో జంకె వెంకటరెడ్డి వర్గం మాత్రం టిడిపి ఆఫర్ ఇస్తోంది కదా..? జంకె పార్టీ మారితే తప్పేంటని ఆయన వర్గీయులు కొందరు వాదిస్తున్నారు. ఎన్నికల పెట్టుబడితో కూడా పనిలేదని టిడిపి ఆఫర్ ఇచ్చినప్పుడు ఎందుకు కాదనాలి... వైసిపిలో మాత్రం న్యాయం జరిగిందేమీ లేదు కదా... అనే వాదనలతో ఇటీవల జంకె వెంకటరెడ్డిపైనా ఒత్తిడి పెరిగినట్లు తెలిసింది. జంకె మాత్రం దాన్ని సున్నితంగా తిరస్కరిస్తున్నట్లు తెలిసింది. చివరకు ఏమి జరుగుతుందో వేచి చూడాల్సిందే.

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-చీమకుర్తి

సమ్మెలో భాగంగా మున్సిపల్ అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సిఐటియు) జిల్లా ఉపాధ్యక్షుడు ఇట్టా నాగయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అల్లడి కోటేశ్వరరావు, పాలేటి ఏడుకొండలు, పి పద్మ, తప్పెట నరసయ్య, కె.గోవిందు, సిఐటియు నాయకులు పూసపాటి వెంకటరావు, కెవిపిఎస్ మండల కార్యదర్శి టి.రామారావు పాల్గొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

డిఆర్‌డిఎ పీడీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా టి.వసుంధర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి పీడీ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.రవి కుమార్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. వసుంధర శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా డ్వామా కార్యాలయంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్(అకౌంట్స్) పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై డిఆర్‌డిఎ పీడీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వసుంధరను మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.రవికుమార్, పి.డేవిడ్, కత్తి కళ్యాణ్, కార్యాలయ సిబ్బంది అభినందించారు.


వసుంధరను సన్మానిస్తున్న అధికారులు

జింకపిల్లను కాపాడిన అటవీశాఖ సిబ్బంది

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దోర్నాల గణపతి చెక్ పోస్టు వద్ద ఓ జింక పిల్ల దారి తప్పింది. ఫారెస్ట్ స్ట్రెంచర్స్‌లో పడిపోయింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకున్న జింక పిల్లను స్ట్రెంచర్స్ నుంచి బయటకు తీశారు. జింకపిల్ల నీరసంగా ఉండి నడవలేని స్థితిలో ఉండడంతో నీళ్ల తాగించి సపర్యలు చేపట్టారు. అనంతరం జింకపిల్ల కొద్దిగా తేరుకోవడంతో అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.


జింక పిల్లతో ఫారెస్టు సిబ్బంది

లబ్ధిదారులకు పింఛను పంపిణీ

ప్రజాశక్తి -కొత్తపట్నం


స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో ఎంపిపి అంజిరెడ్డి చేతుల మీదుగా లబ్ధి దారులకు పెన్షను పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రూ. 3వేల వంతున అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఎంపిడిఒ సుజాత, ఇఒఆర్‌డి బాల చెన్నయ్య, ఎపిఎం రజియా సుల్తానా బేగం, ఎఒ నరేంద్ర దేవ్, ఎంపిటిసి శాంతారావు ,సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.


పింఛను అందజేస్తున్న ఎంపిపి అంజిరెడ్డి

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-కొండపి

కారు, బైకు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని చోడవరం ఎస్‌సి కాలనీ వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... మిట్టపాలెం గ్రామానికి చెందిన కవరతపు నాగార్జున బైకుపై టంగుటూరు వెళ్తున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి కారు బైకును ఎదురుగా ఢీకొంది. దీంతో నాగార్జునకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.


విజయసాయిరెడ్డితో రాజీవ్

విజయసాయి రెడ్డిని కలిసిన రాజీవ్

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

రాజ్యసభ సభ్యులు, ప్రకాశం,నెల్లూరు, బాపట్ల, తిరుపతి, పల్నాడు జిల్లాల వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయి రెడ్డి తాడేపల్లిలో జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ పాలడగు రాజీవ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా వైసిపి అధికార ప్రతినిధి, రాష్ట్ర జెసిఎస్ కోఆర్డినేటర్ పుత్తా శివశంకర్ రెడ్డి కూడా విజయసాయిరెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

దుప్పట్లు అందజేత

శింగరాయకొండ : శింగరాయకొండకు చెందిన కొక్కిలిగడ్డ శిరీష పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు హనుమంతరావు, పద్మ ఆధ్వర్యంలో పాత శింగరాయకొండ పరిధిలోని తాతయ్య గిరిజన కాలనీకి చెందిన చిన్నారులకు, వద్దులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం నూతన సంవత్సర వేడుకలు పురస్కరించుకొని అల్పాహారం, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు, శీలం రాము, చుక్కా కిరణ్ కుమార్ సుదర్శి వెంకట్రావు,చిమటా శ్రీను , కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కొత్తపట్నం

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు బివి. రమణారావు ప్రజాశక్తి 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు అర్జున్ రెడ్డి, విఆర్‌ఒలు, సర్వేయర్లు, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు.. రాకపోకలకు అవస్థలు

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

ఆ రహదారి అధ్వానంగా మారింది. ఫలితంగా రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. రహదారి పొడవునా గుంతలు ఏర్పడ్డాయి. గుంతల కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదానికి గురికావాల్సి వస్తుందోనని ప్రజలు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే....

నాగులుప్పలపాడు నుంచి అమ్మనబ్రోలు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. మూడు కిలోమీటర్ల దూరంలో 36 గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు మార్జిన్ సైతం ఇరువైపుల దెబ్బతింది. దీంతో ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే హడలి పోతున్నారు. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ రహదారిపై కనపర్తి ,వినోదరాయినిపాలెం, దాసరివారిపాలెం అమ్మనబ్రోలు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మహిళలు కూరగాయాలు తీసుకొని ఒంగోలు, ఇతర ప్రాంతాలకు వెళ్లివస్తుంటారు. వివిధ పనుల నిమిత్తం ప్రజలు బైకులపై ఒంగోలు వెళ్లి వస్తుంటారు. చిన్నారులు పాఠశాలలకు వచ్చి పోతుంటారు. రహదారి పొడవునా గుంతలు ఏర్పడంతో రాకపోకల సమయంలో అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా రాత్రి సమయంలో గుంతలు కనిపించ పోవడంతో ప్రమాదాల బారీన పడుతున్నారు. రోడ్డు మార్జిన్ కోతకు గురికావడంతో ఎదురు రెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.


గుంతల మయంగా మారిన రహదారి



ప్రజాశక్తి క్యాలండర్ ఆవిష్కరిస్తున్న గంటా అంజిబాబు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో నిష్పక్షపాతంగా వార్తలు ప్రచురిస్తున్న ప్రజాశక్తి తెలుగు దినపత్రిక ఆంగ్ల సంవత్సరాది 2024సందర్భంగా పటేల్ నగర్ లో ప్రముఖ వ్యాపారవేత్త గంటా నవీన్‌తో కలిసి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బక్కా రోశయ్య, చింతా బాబురావు, దోనేపూడి దేవరాజ్ పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షులు ఏడుకొండలు

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో పేదలు, వృద్ధులకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు నిజాంపట్నం ఏడుకొండలు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. చలికాలం దృష్ట్యా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ తాడికొండ వెంకటేశ్వరరావు, గౌస్ బేగ్, మాతంగి అనిల్ కుమార్, తాడిపర్తి ప్రసాద్, బేతాళ వీరయ్య పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న డాక్టర్ బాబూరావు

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - చీరాల

యువత క్రీడాకారుల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు ఉంటాయని డాక్టర్ ఐ బాబురావు అన్నారు. స్థానిక ప్రేమ హాస్పటల్ ప్రాంగణంలో డిసెంబర్ 30, 31తేదీల్లో ప్రకాశం జిల్లా పేర్నమిట్ట నందు రాష్ట్ర స్థాయి అండర్ 17షఉటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు. రాష్ట్రం నుండి బాల బాలికలు 17జిల్లాల నుండి బాలుర విభాగంలో బాపట్ల జిల్లా విజయనగరం జిల్లాపై 2-0తేడాతో విజయం సాధించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. జిల్లా షఉటింగ్ బాల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఐ బాబురావు ప్రేమ హాస్పటల్ ఆవరణలో క్రీడాకారులను అభినందించారు. షఉటింగ్ బాల్ బాధ్యత తీసుకున్నప్పటి నుండి ఇది నాలుగో విజయమని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎస్ అనిల్ కుమార్, జి వినయ్, వై రాజ్ కుమార్, కె కార్తీక్, పిల్లి రోహిత్ కుమార్, డి ధీరజ్ కుమార్, సిహెచ్ వీర రాఘవ, మహమ్మద్ అలీఫ్ లను చక్కగా తయారు చేసిన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పవని భాను చంద్ర మూర్తి, కార్యదర్శి పిల్లి సురేంద్ర, కోచ్ ఆర్ లక్ష్మీబాయి, పీఈటి జి రత్నకుమార్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - బాపట్ల

సమగ్ర శిక్ష ఉద్యోగుల ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె సోమవారంకు 13వ రోజుకు చేరింది. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చి హామీలు అమలు చేయాలని కోరారు. సమ్మెకు యుటిఎఫ్, ఏపీటీఎఫ్, ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.

వేడుకలు చేసి.. నిరసన తెలిపి..



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వం మొండి పట్టుదలకు పోకుండా అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మెను పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు కోరారు. అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని ఆయన సోమవారం సందర్శించి సమ్మెకు సంఘీభావం తెలిపారు. అనేక పోరాటాలు సమ్మెలతో రాష్ట్రం అట్టుడికి పోతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మికుల సమ్మెలను పరిష్కారం చేయడంలో ఘోరంగా విఫలమైనదని అన్నారు. ఈ ప్రభావం వచ్చే ఎన్నికల్లో పడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్‌వాడీల సమ్మెను సానుకూలంగా పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగులుతుందని హెచ్చరించారు. 21రోజులుగా పట్టుదలతో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను అభినందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్, కె శరత్, అంగన్‌వాడి యూనియన్ నాయకులు శైలశ్రీ, సీత, శ్రీలత, హేమ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న అంగన్‌వాడీలు

సంతమాగులూరు : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్ర రూపం దాల్చనుందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి హెచ్చరించారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడిలకు ఆమె సంఘీభావం తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసుకున్న కేకును కట్ చేసి పంపిణీ చేశారు. మహిళా ఉద్యమాల వల్ల ప్రభుత్వాలు కూలిపోయిన చరిత్ర ఉందన్నారు. మహిళా సాధికారత ప్రభుత్వమని చెప్పుకుంటూ మహిళల సమస్యలపై సానుకూలంగా ఉన్నామంటూ అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. సిఎం అతిథి గృహం కోసం రూ.450కోట్లు, విద్యుత్ స్మార్ట్ మీటర్ల కోసం రూ.20వేల కోట్లు కేటాయించే ప్రభుత్వం, అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయటానికి బడ్జెట్ లేదాని ప్రశ్నించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ ఈనెల 3న కలెక్టర్ కార్యాలయం దిగ్బంధనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు, అంగన్‌వాడి యూనియన్ నాయకులు మస్తాన్ బి, శ్రీదేవి, ఎస్తేరా రాణి, శ్రీదేవి, మల్లేశ్వరి, ఆదెమ్మ, రమణ, నిర్మల పాల్గొన్నారు.



తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ధర్నా

చీరాల : అంగన్‌వాడీల రాష్ట్ర వ్యాప్త సమ్మె 21వ రోజుకు చేరింది. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన ధర్నాలో అంగన్‌వాడి యూనియన్ నాయకులు ఎ జ్యోతి మాట్లాడుతూ తామెంతో చేసామని, పేదల జీవితంలో వెలుగులు నింపడానికి, మూడు పూటలా భోజనం తినాలనేది ప్రభుత్వ ఉద్దేశమంటూ వేతనాలు పెంచమంటే కాలయాపన చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు తమ ఉద్యమం కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు, ఇంద్రాణి, ఝాన్సీ, హనుమాయమ్మ, సుబ్బారావమ్మ తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

నిజాంపట్నం : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని 21రోజులు నుంచి అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న నిరవదిక సమ్మెకు యుటిఎఫ్ నాయకులు మద్దతు ప్రకటించారు. ధర్నాలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ బాపయ్య మాట్లాడుతూ ప్రభుత్వంకు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. ప్రభుత్వ వైఖరి సిగ్గుచేటని అన్నారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు కుర్రా కిరణ్, కుర్రా కిరణ్, ఆలపాటి శ్రావణ్ కుమార్, కె రాంబాబు, డి రమేష్, కరిముల్లా బేగ్ మద్దతు ప్రకటించారు.



తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల కోలాటం

మార్టూరు రూరల్ : మహిళల అభ్యున్నతి కోసం పని చేసే ప్రభుత్వమని చెపుతూ వచ్చిన సిఎం జగన్ తమను మాత్రం కొత్త ఏడాది రోజున రోడ్లపై కూర్చునేలా చేసాడని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక తహశీల్దార్ ఎదుట సమ్మె శిబిరం వద్ద కోలాటం ఆడుతూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు కాన్వెంట్ టీచర్ల కంటే ఎక్కువ వేతనం ఇస్తున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పటం సరికాదని అన్నారు. అంగన్‌వాడీలు పిల్లలకు చదువు చెప్పటంతో పాటు, వారి ఆలనా పాలనా చూడటం, గర్భిణులు, బాలింతలకు ఆహారం అందించటం వంటి సేవలు అందిస్తున్నారనే విషయం ప్రభుత్వ పెద్దలు గుర్తు పెట్టుకోవాలని అన్నారు. ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లించకపోయినా ఎదురు పెట్టుబడులు పెట్టి సెంటర్లు నడుపుతున్నారని గుర్తుచేశారు. అంగన్‌వాడీల సమ్మెకు జనసేన అధ్యక్షులు మందపాటి కిషోర్, యుటీఎఫ్ జిల్లా నాయకులు కందిమళ్ల రవిబాబు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, ఎనికపాటి రాంబాబు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తాళ్లూరి రాణి, శ్యామల, శాంతి, రాజేశ్వరి, నిర్మలకుమారి పాల్గొన్నారు.



తహశీల్దారు వెంకటేశ్వరరావుకు అంగన్‌వాడీల అభినందన

భట్టిప్రోలు : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు 21రోజులు పూర్తి చేసుకున్నాయి. కొత్త సంవత్సరం రోజు కూడా పట్టుదలతో దీక్షలు కొనసాగించారు. తహశీల్దారు దూళిపూడి వెంకటేశ్వరరావుకు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖర్ కు అంగన్‌వాడీలు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్, సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఉన్నారు.

రేపల్లె : అంగన్‌వాడి కార్యకర్తల పోరాటం నూతన సంవత్సరం రోజూ సమ్మె శిబిరాన్ని కొనసాగించారు. దీక్షా శిబిరంలో కేక్ కట్టింగ్ చేసి పోరాటాల సంవత్సరానికి స్వాగతం పలికారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ కార్మిక వర్గానికి పోరాటాలతో స్వాగతం పలికారు. అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు మున్సిపల్ కార్మికులు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు రోడ్డున పడ్డారని అన్నారు. అన్నిచోట్ల నూతన సంవత్సర వేడుకలు చేసుకుంటుంటే ఎపిలో మాత్రం ఉద్యోగ, కార్మికులు రోడ్లపై ఆందోళన చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు ఎన్ కృష్ణకుమారి, కుమారి, నాగమణి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జె ధర్మరాజు, ప్రజా సంఘాల నాయకులు కె రమేష్ పాల్గొన్నారు.



రేపల్లెలో దీక్ష శిభిరంలోనే నూతన సంవత్సర వేడుకలు



నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కారంచేడు : స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం సమ్మె చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల పిల్లల చేత కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు అనిత, మరియమ్మ, వెంకాయమ్మ, సిఐటియు జిల్లా నాయకులు పి కొండయ్య పాల్గొన్నారు.



తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ధర్నా

చెరుకుపల్లి : నూతన సంవత్సరంలోనైనా తమకు తీపి కబురు చెప్పాలని కోరుతూ 21వ రోజు అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన కొనసాగించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా పండగ రోజు కూడా నిరసనలు కొనసాగించే పరిస్థితిని ప్రభుత్వం కల్పించిందని వాపోయారు. అంగన్‌వాడీ కార్యకర్తల పోరాటానికి యుటిఎఫ్ నాయకులు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడి కార్యకర్తలకు తమ సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కాటూరి నాగేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఎడ్ల పందాలు ప్రారంభిస్తున్న డాక్టర్ ఆదిత్య

ఎడ్ల పోటీలు పారంభం

ప్రజాశక్తి - చీరాల

తెలుగు పండుగ సాంప్రదాయాలను అందరూ గౌరవించాలని మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు తనయుడు డాక్టర్ విక్రమ్ ఆదిత్య అన్నారు. మండలంలోని బోయినవారిపాలెంలో పిఎసిఎస్ అధ్యక్షులు బోయిన కేశవులు ఆధ్వర్యంలో పోలురాధ ఎడ్ల పందాలు సోమవారం ప్రారంభించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రతిఏటా పోలురాధ ఎడ్ల పందాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు.

వినూత్న రీతిలో అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నృత్యం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు మల్లేశ్వరి, సుభాషిణి, నాగ మల్లేశ్వరి, అరుణ కుమారి, సుజాత, రోజా, సుబ్బులు, సునీత, అరుణ, జయమ్మ, నాగరాజ కుమారి, సుబ్బులు పాల్గొన్నారు.

మద్దిపాడు : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు జగన్ ఫొటోను ఊయలలో ఉంచి ఉపుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేవరకూ తమ నిరసన కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, నాయకులు బంకా సుబ్బారావు, ఉబ్బా ఆదిలక్ష్మి, నాతాని ధనలక్ష్మి, జయప్రద,రజిని,వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.


కొండపిలో మాట్లాడుతున్న గంటెనపల్లి శ్రీనివాసులు

కంభం : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు కేక్ కట్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల3న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ షేక్ అన్వర్ బాషా, అర్థవీడు, కంభం, బేస్తవారిపేట మండలాల అంగన్‌వాడీలు శ్రీదేవి, ఆదిలక్ష్మి ,సరళాదేవి ,స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.


వైపాలెంలో నృత్యం చేసి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కనిగిరి : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు ఆటలాడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిసి. కేశవరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పట్టని వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సుజాత, సీత, రజిని, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, సౌందర్య, రామసుబ్బులు, డివైఎఫ్ఐ నాయకుడు నరేంద్ర, ఐద్వా నాయకులు బషీరా, శాంత కుమారి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్ల : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు సాంస్కృతిక కార్యక్రమాలతో నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల సమ్మెకు సమ్మెకు పీసీసీ సభ్యులు పిల్లి వెంకటేశ్వరరెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కనిగిరి సమన్వయ కమిటీ సభ్యులు షేక్ మహబూబ్‌బాషా, సంగటి మల్లికార్జునరెడ్డి, అంగన్‌వాడీ ప్రాజెక్టు యూనియన్ నాయకురాలు సోము వెంకటశ్రీలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు రాయల మాలకొండయ్య, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కొండపి : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం గత 21 రోజుల నుంచి పోరాటం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పదించక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగనాడీల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.వందనం, పి.ఆదిలక్ష్మి, పున్నమ్మ, ఎల్.విజయలక్ష్మి, ఆర్.విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.


వెలిగండ్లలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


కనిగిరిలో ఆటలాడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


మద్దిపాడులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


కంభంలో కేక్ కట్ చేసి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

నేతలకు శుభాకాంక్షలు


మార్కాపురంలో మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


మార్కాపురంలో కందులకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


కనిగిరిలో డాక్టర్ ఉగ్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


నాగులుప్పలపాడులో కేక్ కట్ చేస్తున్న ఎంపిపి నలమలపు అంజమ్మ

మాగుంటకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిని ఒంగోలులోని ఆయన కార్యాలయంలో మండల వైసిపి నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైసిసిపి ప్రచార కమిటీ జిల్లా జనరల్ సెక్రటరీ డాకా రాజీవ్ రెడ్డి, వినోదరాయినిపాలెం సర్పంచి ఘట్టమనేని అశోక్ ,అగ్రహారం ఎంపిటిసి పొద పవన్ , యిఇమ్మిశెట్టి బాలకష్ణ, తోకల శ్రీను ఉన్నారు.

ఎమ్మెల్యే స్వామికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కొండపి

కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్యను టిడిపి నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జి.రామయ్యచౌదరి, మండల అధ్యక్షుడు బి.యలమందనాయకుడు, బత్తులనారాయణస్వామి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి, ఒంగోలు

ప్రజాశక్తి క్యాలెండర్‌ను జిల్లా అడిషనల్ ఎస్‌పి నాగేశ్వరరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాస్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ ఉమాపతిచౌదరి పాల్గొన్నారు.




కొండపి : ప్రజాశక్తి 2024 సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ స్త్రీ శిశు సంక్షేమ చైర్‌పర్సన్, కొండపి జడ్‌పిటిసి మారెడ్డి అరుణ వెంకటాద్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి కొండపి విలేకరి కట్టా రవికుమార్, పెరిదేపి నాయకులు నల్లపు విజయ రావ ఎరాజు, అనకర్లపూడి వేముల శ్రీనివాసులు ఉన్నారు.



నాగులుప్పలపాడు : ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఎంపిపి నలమలపు అంజమ్మ, కష్ణారెడ్డి దంపతులు, ఎపిఓ రవిబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం కార్యాలయ టెక్నికల్ అసిస్టెంట్లు పిచ్చయ్య ,జిలాని , ఇసి విజయకుమారి, కంప్యూటర్ ఆపరేటర్ పద్మ, లిడ్ క్యాంపు డైరెక్టరు కంచర్ల సుధాకర్, ఎంపిటిసిలు పొద పవన్, మున్నంగి వెంకట్రావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పల్లెర్ల అంజిరెడ్డి పాల్గొన్నారు.



కంభం : ప్రజాశక్తి2024 క్యాలెండర్‌ను ఎస్ఐ పులి రాజేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి విలేఖరి శ్రీను , ప్రజాశక్తి గిద్దలూరు డివిజన్ ఇన్‌ఛార్జి పూర్ణచంద్రరావు, టిడిపి నాయకులు బొందలపాటి వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తాటిశెట్టి వెంకటప్రసాద్, సిపిఎం మండల నాయకుడు దానం, సిఐటియు నాయకుడు వెంకట్ పాల్గొన్నారు.



పుల్లలచెరువు : ప్రజాశక్తి 2024 నూతన క్యాలెండర్‌ను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరనిక్షన్‌బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి విలేఖరి కొలుకులూరి కష్ణయ్య, పుల్లాలచెరువు సర్పంచి బడిపాటి ఓబులు, టిడిపి నాయకులు కాకర్ల కోటయ్య, గజ్వేల్లి భాస్కరరావు, కొలుకులూరి కుమారు, ఏడుకొండలు, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు దత్తాత్రేయరెడ్డి దాతృత్వం

ప్రజాశక్తి-పిసిపల్లి

మండలంలోని గుంటూరులింగన్నపాలెంకు చెందిన వైసిపి నాయకులు, రైతు బొమ్ము దత్తాత్రేయరెడ్డి దాతృత్వం చాటుకుంటున్నారు. తాను వ్యవసాయం చేసే రోజుల్లో అనేక ఇబ్బందులు పడ్డానని, అలాంటి ఇబ్బందులు నేడు కొంతఅయినా తీర్చేందుకు తన ట్రాక్టర్‌ను ఆయిల్ పోసుకొని వాడుకోవాలని స్థానిక రైతులకు సూచించారు. ఆయన రూ.6.5 లక్షలు పెట్టి 2002లో సోనాలిక ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. దీంతో మండలంలోని లక్ష్మక్కపల్లి పంచాయతీలో గత సంవత్సరం తానే స్వయంగా ఉచితంగా రైతులకు ఉపయోగపడ్డాడు. పొలాలు దుక్కులు దున్నేందుకు, విత్తనాలు విత్తేందుకు, రకరకాల వ్యవసాయ పనులు చేశారు. ఆయిల్‌కు కూడా తన సొంత నిధులతో వెచ్చించి రైతులకు ఉపయోగపడ్డారు. గత సంవత్సరం వ్యవసాయం దెబ్బతినడంతో తాను కూడా గ్రామం వదిలి వెళ్లాడు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇంటి వద్దే ఖాళీగా ఉంది. పంచాయతీలోని



ట్రాక్టర్‌పై రైతు దత్తాత్రేయ రెడ్డి

ట్రాక్టర్‌ను ఉచితంగా వినియోగించుకోవాలని రైతులకు సూచన

రైతులు ట్రాక్టర్‌ను ఉచితంగా వాడుకొని లబ్ధి పొందాలని కోరారు. రైతుల అవసరాల మేరకు ఈ ఏడాది పురుగు మందులను పిచికారీ చేసే యంత్రాలను కూడా తీసుకొచ్చి ఉచితంగా అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. పంచాయతీలోని అడవిలోపల్లి, లింగన్నపాలెం, పరిసర గ్రామాల రైతులు కూడా ఉపయోగించుకోవాలని కోరారు. తాను వ్యవసాయంలో నష్టపోయినప్పటికీ ఇతరులైనా బాగు పడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. గత సంవత్సరం సుమారు 250 ఎకరాల్లో దుక్కులు దున్నుకొని రైతులు లబ్ధి పొందారు. సుమారు 50 మంది రైతులు ఈ విధంగా లబ్ధి పొందారు. ఈ ఏడాది తాను బెంగుళూరు పోవడంతో మరో 100 మంది రైతులకు సుమారు 1000 ఎకరాల్లో సాగుకు, కళ్లాలు చేసుకొనేందుకు ఉపయోగపడుతుందని రైతులు భావిస్తున్నారు. దత్తాత్రేయ రెడ్డి స్వతగాహా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవడం అభినందనీయమని పలువురు అభినందిస్తున్నారు.


కందుల నారాయణరెడ్డిని సత్కరిస్తున్న టిడిపి నాయకులు

కందుల నారాయణరెడ్డికి సత్కారం

ప్రజాశక్తి-పొదిలి

మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డిని పొదిలి, కొనకనమిట్ల మండలాలకు చెందిన పలువురు టిడిపి నాయకులు ఆయన నివాసంలో కలిసి బొకేలందించి పెద్దఎత్తున శాలువాలతో సన్మానించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పొదిలి, కొనకనమిట్ల టిడిపి నాయకులు కాటూరి వెంకట నారాయణబాబు, నారాయణ, ప్రతాప్, మీగడ ఓబుల్ రెడ్డి, ముల్లా ఖుర్ధూస్, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, యాసిన్, సయ్యద్ ఇమాంసాహెబ్, నేరెళ్ల శ్రీనివాసులు, టెంట్ హౌస్ నరసింహారావు, భూమా సుబ్బయ్య, షేక్ గౌస్ బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి ఎస్‌టిఓ పరిధిలోని పెన్షనర్లకు జీవన్ ప్రమాణ యాప్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ తీసుకుని తమకు అందించాలన్నారు. సోమవారం నూతన సంవత్సర వేళ తనను కలిసిన పొదిలి తాలూకా విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ జనవరి ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు పెన్షనర్లు అందరూ తమ లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని కోరారు. లైఫ్ సర్టిఫికెట్ అందజేసేవారు తమ ఆధార్ కార్డు, సెల్ ఫోన్ తప్పక తీసుకురావాలని సీనియర్ అసిస్టెంట్ కరీముల్లా తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదిలి తాలూకా యూనిట్ అధ్యక్షులు బాదుల్లా, ప్రధాన కార్యదర్శి మదార్‌వలి, వీరారెడ్డి, సుబ్బారావు, డిఎల్ నరసింహారావు, మోహన్‌రావు, మూసా జానీ, గోవిందయ్య తదితర పెన్షనర్లు పాల్గొన్నారు.

వికలాంగుడిని సత్కరించిన పార్దు

మానవత స్వచ్ఛంద సేవ సంస్థ చైర్మన్ మువ్వల పార్దు తన స్వగృహంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసే సందర్భంగా వైసిపి దివ్యాంగుల విభాగం పొదిలి మండల అధ్యక్షుడు దేవళ్ల ఆంజనేయులు చేసే కార్యక్రమాలను మెచ్చుకొని సన్మానించారు. అలాగే పట్టణ ప్రజలకు మంచినీరు అందించే బుగ్గచలం వాటర్ ట్యాంక్ సిబ్బంది ఏడుకొండలు, కరిముల్లాలను ఆయన శాలువాతో సత్కరించారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని 6 మండలాలకు చెందిన నాయకులు, అధికారులు, వైసీపీ శ్రేణులు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి, వైసిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి తమ్మినేని సుజాతరెడ్డి దంపతులు, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, వైసిపి నాయకులు మూలే మాలకొండారెడ్డి, తెల్లగడ్డ వెంకట్రావు, లక్కిరెడ్డి హనుమారెడ్డి, ఏ విద్యాధర్, అయితా సుబ్బయ్య, బత్తుల మాలి, పాశం కొండయ్య తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

'బూచేపల్లి'కి అభిమానుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-దర్శి

జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి దర్శిలోని వారి గృహానికి అభిమానులు భారీగా తరలివచ్చారు. నూతన సంవత్సర సందర్భంగా దర్శిలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కట్ చేసి జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా వైసీపీ నాయకులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి వారిని గజమాలతో ఘనంగా సన్మానించారు. మరొక మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు నారపుశెట్టి పాపారావు స్వగృహంలో కూడా టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నాయకులు గరికపాటి వెంకట్‌కు తమ కార్యాలయంలో అభిమానులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు గజమాలతో సత్కరించారు. దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బూచేపల్లి నివాసంలో పోలీసులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, తూము సుబ్బారెడ్డితో పాటు షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎం బాషా, ఎంపీపీలు గోళ్లపాటి సుధారాణి, ఉష, జడ్పీటీసీలు నుసుం నాగిరెడ్డి, రత్నంరాజు, మాజీ


బూచేపల్లిని గజమాలతో సత్కరిస్తున్న తాళ్లూరు నాయకులు

ఎంపీపీలు ఇత్తడి దేవదానం, మధుసూదన్‌రెడ్డి, రామిరెడ్డి, వీరగంధం కోటయ్య, మోషే, శ్రీనివాసరెడ్డి, కొల్లా భాస్కర్, నరసింహారెడ్డి, ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. అదే విధంగా టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు చిట్టే వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీను, బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, శివకోటేశ్వరరావు, పలువురు జనసేన నాయకులు ఉన్నారు. అదే విధంగా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావును కలిసేందుకు ఒంగోలుకు తరలివెళ్లారు.


న్యూఇయర్ కేక్‌ను కట్ చేస్తున్న దృశ్యం

'ఐ కిడ్స్'లో హ్యాపీ న్యూఇయర్

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని ఐ కిడ్స్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు డైరెక్టర్ రజియ, ప్రిన్సిపల్ షరీఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అందరూ చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలను అలంకరించి తల్లిదండ్రులకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలని డైరెక్టర్ రజియ తెలియజేశారు. న్యూ ఇయర్ కేక్‌ను చిన్నారులు, ఉపాధ్యాయులు కలిసి కట్ చేసి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మి, ప్రియదర్శిని, గీత, ఉష, అమరేశ్వరి, జబీన, అమీరున్ పాల్గొన్నారు.

మంత్రికి నాయకుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పొదిలి

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కొండపి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఆదిమూలపు సురేష్‌ను పలువురు నాయకులు కలిసి బొకే అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిని ఒంగోలు పార్టీ కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఎంపీపీ సంఘం జిల్లా అధ్యక్షులు, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, మర్రిపూడి మండల వైసీపీ నాయకులు ఇనుకొల్లు మాదిరెడ్డి, బోదా రమణారెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి, బీవీ భాస్కర్ రెడ్డి, వాకా సుధాకర్‌రెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, ఇనుకొల్లు శ్రీనివాసరెడ్డి, వాకా అంజిరెడ్డి, కదిరి భాస్కర్, ప్రభాకర్‌రెడ్డి, మాకినేని వెంకట్రావు, వోగిరాల నారాయణరెడ్డి, మాకినేని రమణయ్య, బోనుబోయిన నరసింహారావు, నాగయ్య, హనుమంతరావు, పొదిలి నాయకులు మీగడ ఈశ్వర్‌రెడ్డి, గుంటూరు పిచ్చిరెడ్డి, టెంట్ హౌస్ సుబ్బయ్య కలిసి అభినందనలు తెలిపారు. పొదిలిలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస్ రెడ్డి నివాస గృహంలో పలువురు నాయకులు కలిసి బొకేలందించి శాలువా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో రెడ్డి జెఏసి డాక్టర్ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆర్ఎంపీ వైద్యులు యర్రం వెంకట్‌రెడ్డి, వైసీపీ నాయకులు బోనం పిచ్చిరెడ్డి, చలమారెడ్డి, సీసీ కేర్ శ్రీనివాస్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పట్ల నిరంకుశ ధోరణి తగదు

ప్రజాశక్తి-కనిగిరి

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం తగదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిసి కేశవరావు అన్నారు. నూతన సంవత్సరం ప్రారంభం రోజు సోమవారం కూడా మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు నిరసన తెలియజేశారు. దీంతో అధికారులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సిఐడి నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు వచ్చి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లోకి వెళ్లనివ్వాలని కోరినప్పటికీ తమ సమస్యలు పరిష్కరించలేని మీరు చెబితే వినేది లేదని ఉన్నతాధికారులు చొరవ చూపాలని తేల్చి చెప్పారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి కేశవరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని, అప్కాస్ నుంచి మినహాయించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పదో పిఆర్సి ప్రకారం రూ.20 వేల వేతనం కొనసాగించాలని కోరారు. విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికులకు రూ.పది లక్షల


సమ్మెను కొనసాగిస్తున్న మున్సిపల్ కార్మికులు

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు అవసరమని అన్నారు. మున్సిపల్ కార్మికుల పట్ల వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చార్లెస్, వి మార్క్, గరటయ్య, దస్తగిరి, రమణమ్మ, ఈశ్వరమ్మ, దానియేలు, సిఐటియు నాయకులు ఎస్‌కె బషీర, డివైఎఫ్ఐ నాయకులు నరేంద్ర పాల్గొన్నారు.

'జగన్ కోర్టుకు రావాలి'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కోడి కత్తి శ్రీను కేసులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోర్టుకు రావాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. కోడి కత్తి శీను కేసును జగన్ ప్రభుత్వం ఉపసంహరించు కోవాలనే డిమాండ్‌తో ఒంగోలులోని దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు దారా అంజయ్య, తానికొండ ఆనంద్, కాకుమాను రవి, పాలేటి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

నేతల ఇంట సందడి



ఎంఎల్ఎ కోన రఘుపతి నివాసంలో కేక్‌కటింగ్



రేపల్లె వైసిపి ఇన్‌ఛార్జి గణేష్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి యంత్రాంగం

నూతన సంవత్సర వేడుకలు వివిధ పార్టీల నేతల ఇళ్ల వద్ద ఆయా నేతల అనుచరులతో సందడి నెలకొన్నది. అధికార పార్టీ ఎంఎల్ఎలు, ఇన్‌చార్జిల ఇళ్లు, కార్యాలయాల వద్ద అనుచరులతోపాటు అధికారులూ పెద్ద సంఖ్యలో హాజరై నేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. బాపట్ల ఎంఎల్ఎ కోన రఘుపతి ఇంటి వద్ద, చీరాల ఎంఎల్ఎ కరణం బలరామకృష్ణమూర్తి, వేమూరు వైసిపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, రేపల్లె వైసిపి ఇన్‌చార్జి ఈవూరు గణేష్ ఇంటి వద్ద అనుచరులతోపాటు అధికారులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. బాపట్ల టిడిపి ఇన్‌ఛార్జి నరేంద్రవర్మ, చీరాల టిడిపి ఇన్‌చార్జి కొండయ్య, మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు, యడం బాలాజీ ఇళ్ల వద్ద వారి అనుచరులు శుభాకాంక్షలు తెలిపారు. బాపట్ల మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్‌ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు, సమాజ్‌వాదీ పార్టీ జిల్లా అధ్యక్షులు మేధ శ్రీనివాసరావు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.



వేమూరు వైసిపి ఇన్‌ఛార్జి అశోక్‌కు అభినందనలు



చీరాల్లో యడం బాలాజీకి జీడిపప్పుదండతో సత్కారం



చీరాల్లో మాజీ మంత్రి డాక్టర్ పాలేటి నివాసంలో కేక్‌కటింగ్



బాపట్ల టిడిపి ఇన్‌ఛార్జి నరేంద్ర వర్మకు అభినందనలు



బాపట్లలో మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్‌కు అభినందనలు

సిసిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పంగులూరు



తుళ్ళూరి శ్రీనివాసరావు

వైఎస్ఆర్ క్రాంతి పదం, డిఆర్‌డిఎ ముప్పవరం క్లస్టర్ సిసిగా తుళ్ళూరి శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. వైస్సార్ క్రాంతి పథంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు, స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు, బలోపేతం చేయటంలో కృషి చేస్తానని, గతంలో 5ఏళ్ల పని చేసిన అనుభవంతో ప్రభుత్వ పథకాలు ముందుకు తీసుకు వెళతానని ప్రజాశక్తికి తెలిపారు.



ఎండిఆర్‌టి సాధించిన రమేష్‌కు ఘన సత్కారం

రమేష్‌బాబుకు సత్కారం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

స్థానిక ఎల్ఐసి శాటిలైట్ బ్రాంచిలో వరుసగా 3వ సారి ఎండిఆర్‌టిగా విజయం సాధించిన అర్ధపల్లి పార్థసారధిని మేనేజరు జి రమేష్ సత్కరించారు. సారధి చేసిన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్లు ఎవి రమణ ప్రసాద్, జి చెంచయ్య, లావణ్యలు పాల్గొన్నారు.

టిడిపితోనే ప్రజాపాలన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

కొత్త ఏడాదిలో అసమర్థ ప్రభుత్వాన్ని సాగనంపి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కోరారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా వర్ధిల్లాలన్నారు. ప్రకృతి ప్రకోపాలు లేకుండా అన్నదాతలు ఆనందంగా, సుభిక్షంగా ఉండాలని అన్నారు. ప్రజలందరూ సోదర భావంతో మెలగాలని ఆకాంక్షించారు. ప్రజలు కోరుకున్న అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతో సాధ్యమని అన్నారు.



మాజీ ఎంఎల్ఎ ముమ్మనేనికి టిడిపి నేతల సత్కారం

మాజీ ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు

భట్టిప్రోలు : రేపల్లె మాజీ ఎంఎల్ఎ ముమ్మనేని వెంకటసుబ్బయ్యను ఆయన స్వగృహంలో కలిసి పలు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. వేమూరు, రేపల్లె పరిధిలోని టిడిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. టిడిపి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాచర్ల నాగరాజు, దీపాల శివప్రసాద్, అనగాని ఏడుకొండలు, జన్నాదుల రెడ్డియ్య, పులిమి దోలా శివకుమార్, అత్తలూరి బాలకృష్ణ, కూరపాటి రఘురామయ్య ఉన్నారు.

చెరుకుపల్లి : కీళ్ల మార్పిడి చికిత్స, లాప్రోస్కోపిక్ సర్జరీల్లో జిల్లాలో ప్రసిద్ధిగాంచిన సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కమ్మెల హరీష్, డాక్టర్ బోలగాని శివరామకృష్ణ ఆస్పత్రిలో నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కట్ చేశారు.



కేక్‌కట్ చేస్తున్న డాక్టర్ హరీష్



వైసిపి ఇన్‌ఛార్జి ఆమంచి సమక్షంలో వైసిపిలో చేరికలు

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - యద్దనపూడి

వైసిపి ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ సమయంలో వైసిపిలోకి భారీగా చేరారు. వైసిపికి చెందిన వీరు డ్రైవర్లుగా పనిచేస్తున్నారని, బాధలకు తీసుకెళ్లి టిడిపి కండువాలు కప్పి టిడిపిలో చేరినట్లు టిడిపి సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నారని ఆరోపించారు. మండలంలోని అనంతవరం ఎస్సీ కాలనీ వాస్తవ్యులు వైసిపి మండల కన్వీనర్ షేక్ శీను ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. దేవరపల్లి దానయ్య, దేవరపల్లి మహేష్, దేవర పల్లి యాలం రాజు, మద్దిరాల ప్రసాదరావు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

చల్లపల్లి నుండి భట్టిప్రోలు జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడ మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ చెప్పిన ప్రకారం చల్లపల్లి పడమటి వీధికి చెందిన గురువరిచి రమేష్ (33)అనే వ్యక్తి కొన్ని రోజులుగా అద్దెపల్లిలో నివాసం ఉంటున్నాడు. చల్లపల్లిలో ఓ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా జాతీయ రహదారిపై గుడికిపూడి పంచాయతీ పరిధిలో రహదారి ప్రక్కన ప్రమాదానికి గురై మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె వైద్యశాలకు తరలించారు. ఏదైనా వాహనం ఢీ కొట్టిందా లేదా ఇంకేదైనా సంఘటన జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. మృతుని భార్య భట్టిప్రోలు కోపరేటివ్ బ్యాంకులో పనిచేస్తుండటంతో భట్టిప్రోలులో నివాసం ఉంటున్నట్లు తెలిసింది.

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

అక్రమంగా నిల్వ ఉంచిన 400లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని స్టువర్టుపురంలో సోమవారం నిర్వహించిన తనిఖీల్లో రెండవ గ్యాంగ్ ప్రాంతంలో కుందేరు వాగు వద్ద బెల్లం ఊటను గుర్తించినట్లు తెలిపారు. అక్రమంగా సారా తయారు చేయడం కోసం నిలువ ఉంచిన బెల్లం ఊట దాచిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

టిడిపి, ఏలూరిపై కొత్తపాట ఆవిష్కరణ

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కొత్త పాటను సోమవారం ఆవిష్కరించారు. ఆయన చేసిన పాద యాత్ర, అభివృద్ధి తీరుతెన్నులను వివరిస్తూ ప్రముఖ గాయకుడు నల్గొండ గద్దర్ ఆలపించిన పాటను ఆస్వాదించారు. టిడిపి కార్యకర్తలు, నాయకులు, అభిమానుల మధ్య ఈ పాట ఆవిష్కరించిన వేడుకను ఘనంగా నిర్వహించారు. అభివృద్ధి చేసిన ఏలూరిని మరోసారి గెలిపించాలని కోరారు. టిడిపి అధ్యక్షుడు షేక్ శంషుద్దీన్, యద్ద నపూడి అధ్యక్షులు రంగయ్య చౌదరి, మానం హరిబాబు, కోడూరి బ్రహ్మాచారి, మక్కెన శేఖర్ బాబు, అగ్గిగుండాల కృష్ణ, సునీత, కొల్లా శ్రీరామ్ ప్రసాద్ పాల్గొన్నారు.



టిడిపి పాట ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ ఏలూరి

వైసిపి జెండా ఎగురవేస్తాం : హనిమిరెడ్డి

ప్రజాశక్తి - అద్దంకి

ప్రజల ఆదరణ, అభిమానాలు, కార్యకర్తల్లో కసి, బడుగు బలహీనవర్గాల ఆత్మీయత ఇవన్నీ చూస్తుంటే గెలుపు మనదేనని, గెలుపు విశ్వాసంతో రాబోయే మూడు నెలలు ప్రతి ఒక్కరూ శ్రమించి పనిచేయాలని వైసిపి ఇన్చార్జ్ పాణెం హనిమిరెడ్డి అన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా వైసిపి నియోజకవర్గ కార్యాలయాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. నూతన సంవత్సర వేడుకల్లో కార్యకర్తలకు, నాయకులకు, అధికారులకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సామాన్య కుటుంబానికి చెందిన తాను పులివెందులలో డిప్లమో చదివానని, ఫీజుకు సరిపడా డబ్బులు లేకపోవడంతో ఆరోజు రాజశేఖర్‌రెడ్డి సహకరించారని అన్నారు. అప్పుడు పొందిన లబ్ది వలనే నాటి నుండి నేటి వరకు గడిచిన 25ఏళ్లలో రాజశేఖర్‌రెడ్డి అభిమానిగా వారి కుటుంబంతో కలిసి సాగానని అన్నారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికి లబ్ది చేకూరేలా రాజకీ యాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించా రని అన్నారు. అలా లబ్ది పొందిన ప్రతి ఒక్కరూ 2024 ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డికి అండగా నిలిచి 175కు 175 స్థానాల గెలుపులో భాగంగా అద్దంకిని గెలిపించుకొని జగనన్నకు కానుకగా ఇవ్వాలని కోరారు. రాజకీయాల కోసం గ్రూపులు కట్టడం, గొడవలు పడటం, ఘర్షణలకు చోటు కల్పించడం తనకు ఇష్టం ఉండదని అన్నారు. కులాలు, మతాలు వంటివి ఎవరు పట్టించుకో వద్దని అన్నారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా, నష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నేటి నుండి ఇదే కార్యాలయంలో అందరికీ అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మారం వెంకారెడ్డి, బివి కృష్ణారెడ్డి, కాకాని రాధాకృష్ణమూర్తి, కోట శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న హనిమిరెడ్డి

బాచిన కృష్ణచైతన్యకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అద్దంకి

నూతన సంవత్సర వేడుకలు రెండు శిబిరాలుగా జరిగాయి. వైసీపీ ఇంచార్జిగా పానెం హనిమిరెడ్డి నూతన కార్యాలయం ప్రారంభించి వేడుకలు జరుపుకున్నారు. నిన్నటి వరకు ఇంచార్జిగా ఉన్న బాచిన కృష్ణ చైతన్య ఒంగోలు కేంద్రంగా తన కార్యాల యంలో వేడుకలు నిర్వహించారు. నిన్నటి వరకు అద్దంకిలో నిర్మించిన కార్యాలయంలో క్రిస్మస్, సెమీ క్రిస్మస్, రాజకీయ సభలు నిర్వహించారు. అయితే నూతన సంవత్సర వేడుకలు కూడా అక్కడే జరుగుతాయని అందరూ అనుకున్నారు. అందుకు భిన్నంగా ఒంగోలులో నిర్వహించారు. నియోజకవర్గంలోని కొందరు నేతలు ఒంగోలు వెళ్లారు.



శాప్ ఛైర్మన్ కృష్ణచైతన్యకు శుభాకాంక్షలు

● ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఒంగోలులో కలెక్టర్ దినేష్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు.

- ప్రజాశక్తి, ఒంగోలు

● క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి కోర్టు క్యాలెండర్‌ను ఒంగోలులో డిఆర్‌ఒ ఆర్.శ్రీలత సోమవారం ఆవిష్కరించారు.

- ప్రజాశక్తి, ఒంగోలు

● ఐద్వా క్యాలెండర్ ఆవిష్కరణ



ఐద్వా క్యాలెండర్‌ను బెతూన్ నర్సింగ్ హెూమ్ వైద్యులు డాక్టర్ ఉదయిని, డాక్టర్ స్వాతి సోమవారం ఆవిష్కరించారు.

- ప్రజాశక్తి, ఒంగోలు

● వ్యకాస క్యాలెండర్ ఆవిష్కరణ



వ్యవసాయ కార్మిక సంఘం క్యాలెండర్‌ను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శీనారెడ్డి సోమవారం ఆవిష్కరించారు.

- ప్రజాశక్తి, ఒంగోలు

● 'సిల్వన్‌రాజు'కు సత్కారం



ఐఆర్‌ఎస్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ సిల్వన్‌రాజును ఉపాస్ హాస్పిటల్స్ డైరెక్టర్లు సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

- ప్రజాశక్తి, ఒంగోలు

● మేయర్‌కు శుభాకాంక్షలు



నగర మేయర్ గంగాడ సుజాతకు ఒంగోలు, సంతపేటలోని ఆమె నివాసంలో నగర కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ గంగాడ సుజాత జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

- ప్రజాశక్తి, ఒంగోలు సబర్బన్

తమిళనాడు జాలర్ల

సమస్య పరిష్కారానికి చర్యలు

కేంద్ర మత్స్యశాఖ మంత్రి పర్షో త్తం రూపాల

ప్రజాశక్తి-కొత్తపట్నం

తమిళనాడు జాలర్ల నుంచి ఏపీ జాలర్లకు ఎదురవుతున్న సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని కేంద్ర మత్స్యశాఖ మంత్రి పర్షో త్తం రూపాల చెప్పారు. సాగర్ పరిక్రమ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి ఆయన కొత్తపట్నం మండలం పల్లెపాలెంలో మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించారు. తమిళనాడు నుంచి వస్తున్న జాలర్ల వల్ల తమకు తీవ్ర నష్టం కలుగుతుందని, మత్స్య సంపద కూడా తగ్గిపోతోందని ఈ సందర్భంగా స్థానిక మత్స్యకారులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. సాగర మిత్ర నియామకాలలో తమ సామాజిక వర్గానికి చెందిన యువతకే అవకాశం కల్పించాలని, కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా ప్రస్తుతం ఇస్తున్న లక్ష అరవై వేల రూపాయల రుణ సహాయాన్ని మూడు లక్షల రూపాయలకు పెంచాలని స్థానికులు ఈ సందర్భంగా మంత్రిని కోరారు. మత్స్యకారుల పడవలకు డీజిల్ పై రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది రూపాయల సబ్సిడీ ఇస్తున్నదని, కేంద్ర ప్రభుత్వం కూడా ఇదేవిధంగా సబ్సిడీ ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. వేట నిషేధ కాలంలో మాత్రమే తమకు జీవనోపాధి కోసం ప్రత్యేక భృతి ఇస్తున్నారని, తుఫాను సమయాలలో కూడా వారం నుంచి పది రోజులపాటు వేటకు వెళ్లే పరిస్థితి లేనందున ఆ రోజులలో కూడా తమకు జీవన ఉపాధి కోసం భ్రుతి కల్పించాలని వారు కోరారు. పడవ, ఇంజిన్, వలను ఒక యూనిట్ గా కలిపి సబ్సిడీ పై అందిస్తున్నారని, కానీ వలలు, ఇంజిన్ల జీవిత కాలం తక్కువగా ఉన్నందున వీటిని వేరువేరుగా సబ్సిడీతో అందిస్తే మత్స్యకారులకు ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు చెప్పగా మంత్రి సానుకూలంగా స్పందించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో మత్స్య రంగానిది కూడా కీలక పాత్ర అని చెప్పారు. ఈ రంగంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యము ఇస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారుల సమస్యలు తెలుసుకోవడానికే తాను పర్యటిస్తున్నానని, నూతన సంవత్సర వేడుకలను ఢిల్లీలో ఉండి జరుపుకునే అవకాశం ఉన్నప్పటికీ మత్స్యకారుల మధ్య ఉండి వారి సమస్యలు తెలుసుకోవాలన్న ఆలోచనతోనే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నానని ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు. అనంతరం నూతన సంవత్సరం కేక్ ను మంత్రి కట్ చేశారు. స్థానిక లబ్ధిదారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేశారు. సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను కేంద్రమంత్రి వీక్షించారు. మంత్రి వెంట ఎంపీ బీద. మస్తాన్ రావు, జాయింట్ కలెక్టర్ కె .శ్రీనివాసులు, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ఏ.చంద్రశేఖర్ రెడ్డి , ఒంగోలు ఆర్డిఓ విశ్వేశ్వరరావు , రాష్ట్ర మత్స్య కార్పోరేషన్ డైరెక్టర్ వాయల సుమతి, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

● కలెక్టర్‌కు శుభాకాంక్షలు



నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కలెక్టర్ రంజిత్‌బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న డిఆర్‌ఒ వెంకటరమణ, కార్యాలయ అధికారులు

- ప్రజాశక్తి, బాపట్ల

● మంత్రికి అంగన్‌వాడీల వినతి



అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ని అంగన్‌వాడీలు, నాయకులు సోమవారం కలిసి.. వినతిపత్రం అందజేశారు. ముందుగా జిల్లా కలెక్టరేట్ నుంచి ర్యాలీగా మంత్రి క్యాంప్ ఆఫీస్‌కి వెళ్లారు.

- ప్రజాశక్తి, ఒంగోలు

అట్టహాసంగా నూతన సంవత్సర వేడుకలు

- ఘన స్వాగతం పలికిన జిల్లా ప్రజలు - అధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద కోలాహలం



మంత్రి సురేష్‌కు కేక్ తినిపిస్తున్న ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా 2024 కొత్త సంవత్సర వేడుకలు అట్టహాసంగా జరిగాయి. కొత్త సంవత్సరానికి జిల్లా ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచుకొని కొత్త సంవత్సర వేడుకలలో మునిగిపోయారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్లు, కార్యాలయాల వద్ద కోలాహలం నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలువురు పుష్పగుచ్చాలు, పూలమాలలు వేసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కలెక్టర్ కార్యాలయంలో..

ప్రకాశం కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో కలెక్టర్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్, ఆయన సతీమణి విజయ కృష్ణన్ దంపతులకు జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత, జిల్లా సివిల్ సప్లై అధికారి ఏ.ఉదయ్ భాస్కర్, పలువురు అధికారులు, పలు అసోసియేషన్ల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, వైసిపి నాయకురాలు బైరెడ్డి అరుణ, టిటిడి బోర్డు మెంబర్ శిద్దా సుధీర్ కుమార్, పలు ఉద్యోగ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.



ఒంగోలులో కేక్ కట్ చేస్తున్న దామచర్ల జనార్ధన్

టిడిపి కార్యాలయంలో..

ఒంగోలు టిడిపి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

మంత్రి క్యాంపు కార్యాలయంలో..

ఒంగోలులోని మంత్రి సురేష్ క్యాంప్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కు ఒంగోలు, కొండపి, యర్రగొండపాలెం నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు వచ్చి.. శుభాకాంక్షలు తెలిపారు.

శిద్దా రాఘవరావు నివాసంలో..

మాజీమంత్రి శిద్దా రాఘవరావు నివాసంలో కొత్త సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఆయన తనయుడు, టిటిడి ట్రస్ట్ బోర్డ్ సభ్యులు శిద్దా సుధీర్ కుమార్‌కు శుభాకాంక్షలు చెప్పడానికి ఉమ్మడి ప్రకాశం జిల్లాల నుండి అభిమానులు భారీగా తరలివచ్చారు. సుధీర్ కుమార్ ప్రకాశం కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చీమకుర్తిలో గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఏ గిరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను శిద్దా రాఘవరావు దంపతులు కట్ చేశారు. కార్యక్రమంలో మద్దిపాడు ఏఎంసి మాజీ ఛైర్మన్ మారం వెంకారెడ్డి, శిద్దా పాండురంగారావు, శిద్దా ఆంజనేయప్రసాద్, శిద్దా సాయిబాబు, శిద్దా పెద్దబాబు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంట కార్యాలయంలో..

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్చాలు, పూలదండలు వేసి.. శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అయినాబత్తిని ఘనశ్యాం, తాతా ప్రసాద్, బెల్లం సత్యనారాయణ, పమ్మి భద్రిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




ఒంగోలులో కేక్ కట్ చేస్తున్న శిద్దా రాఘవరావు, ఆయన కుటుంబం

చఅబక

బూచేపల్లికి అభిమానుల శుభాకాంక్షలు

చీమకుర్తి: జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిలకు వైసిపి అభిమానులు,కార్యకర్తలు,అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. మద్దిపాడు ఏఎంసి మాజీ ఛైర్మన్ మారంవెంకారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేశారు.



చీమకుర్తిలో బూచేపల్లికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం